క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



పాన్‌గల్: మండలంలోని రేమద్దుల ఉన్నత పాఠశాలల్లో ప్రైవేట్ అంటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నా సాయిరాం అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. హైస్కూల్ జీహెచ్‌ఎం లత, ఉపాధ్యాయ బృందం రూ. 14వేలను బాధితుడికి అందజేశారు.

నేడు మానసిక రోగులకు వైద్య శిబిరం

పాన్‌గల్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సోమవారం మానసిక రోగులకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. మానసిక వైద్య నిపుణురాలు అంబుజా ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, మానసిక రుగ్మతలు, మానసిక ఆందోళనలు ఉన్న వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

బీజేపీ కమిటీల ఎంపిక

వనపర్తి క్రైం: మండలంలోని అంజనగిరిలో ఆదివారం బీజేపీ పోలింగ్ బూత్ కమిటీని ఎంపిక చేశారు. 159 పోలింగ్ బూత్ కమిటీ అధ్యక్షుడిగా వెంకటేష్, ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి, భాస్కర్, సభ్యులను నియమించారు. కార్యక్రమంలో కృష్ణ, దేవేందర్, వెంకటేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధాన ప్రక్రియ పరిశీలన

పాన్‌గల్: ఉపాధి కూలీ జాబ్‌కార్డుకు ఆధార్ అనుసంధానం చేసే ప్రక్రియను మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. మండలంలోని 28 పంచాయతీలో 15వేల జాబ్‌కార్డులు ఉన్నాయని, ఇప్పటికి 75 శాతం ఆధార్ అనుసంధానం పూర్తి చేశారని పేర్కొన్నారు. జాబ్‌కార్డుకు ఆధార్ అనుసంధానం చేస్తేనే ఉపాధి కూలీలకు వారి ఖాతాల్లో పనిచేసిన డబ్బులు జమ అవుతాయన్నారు.

ధ్వజస్తంభం, బొడ్రాయి ప్రతిష్ఠాపనకు విరాళాలు

పెబ్బేరు: మండలంలోని రంగాపూర్‌లో చింతల వేంకటేశ్వర స్వామి దేవాలయం ధ్వజస్తంభం, బొడ్రాళ్ల ప్రతిష్ఠాపనకు ఆదివారం విరాళాలు అందజేశారు. గ్రామంలో ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 1వరకు మహోత్సవాలు నిర్వహిస్తున్నడంతో మత్స్యా కార సహకారం సంఘం ఆధ్వర్యంలో రూ. లక్ష, రాజశేఖర్ రూ.20 వేలు, చిరంజీవి రూ.5వేలు, ఆంజనేయులు రూ. 5వేలు కమిటీ సభ్యులకు అందజేశారు.

‘భరోసా యాత్ర’తోనే ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు

అడ్డాకుల: దేవరకద్ర నియోజకవర్గంలో చేపట్టిన భరోసా యాత్రతోనే మూసాపేట మండలం జానంపేట వద్ద ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగేందర్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రి లేకపోవడంతో అత్యవసర చికిత్స అందక చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. గతేడాది మేలో ఉచిత విద్య, వైద్యం అందించాలనే డిమాండ్‌తో 300 కిలోమీటర్లు పాదయాత్ర చేసినట్లు గుర్తు చేశారు. ప్రమాదాలు జరిగినప్పుడు సకాలంలో వైద్యం అందించేందుకు జాతీయ రహదారిపై ఉన్న పీహెచ్‌సీలను 100 పడకల ఆస్పత్రులుగా మార్చాలని పాదయాత్రతో పాలకుల కళ్లు తెరిపించామన్నారు. తాము చేపట్టిన భరోసా యాత్రతో దేవరకద్రలో బీసీ గురుకుల కళాశాల, జానంపేటలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేస్తుండటం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం



అడ్డాకుల: మూసాపేట మండలంలోని కొమిరెడ్డిపల్లికి చెందిన పూర్వ విద్యార్థి శ్రీనివాస్‌సాగర్‌కు పూర్వ విద్యార్థులందరు కలిసి ఆర్థిక సాయం అందజేశారు. 1988–89లో అడ్డాకుల మండలంలోని కందూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీనివాస్‌సాగర్ పదో తరగతి చదివాడు. కొన్నేళ్ల నుంచి ఆయన తీవ్ర అనారోగ్యానికి గురై కొమిరెడ్డిపల్లిలోని ఇంటి వద్దే ఉంటున్నాడు. కుటుంబ పోషణ భారంగా మారడంతో పదో తరగతి పూర్వ విద్యార్థులు రూ.50వేలను పోగు చేశారు. ఆదివారం బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని వాకబు చేశారు. అనంతరం నగదును అందజేసి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి, కందూర్ సర్పంచ్ శ్రీకాంత్, కుపేందర్‌గౌడ్, చంద్రశేఖర్‌గౌడ్, జగదీశ్వ రాచారి, ఉమేష్, వీరేందర్, లక్ష్మయ్య, రాములు, నరేందర్‌రెడ్డి, శేషయ్య తదితరులు ఉన్నారు.

వరి సాగుకే మొగ్గు

- మండలంలో 8,500 ఎకరాల్లో సాగు
- తగ్గిన ఆరుతడి పంటలు



మల్కమియాన్‌పల్లి శివారులో సాగు చేసిన వరి పంట

ఖిల్లాఘనపురం: వరి పంట సాగుకు ప్రభుత్వం నుంచి ఆంక్షలు లేకపోవడంతో పాటుగా సాగునీరు పుష్కలంగా లభిస్తుండడంతో రైతులు వరి సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఈ సంవత్సరం వర్షాకాలంలో వర్షాలు విస్తారంగా కురవడంతో పాటుగా కల్వకుర్తి లిఫ్ట్ ద్వారా మండలంలో కృష్ణానీరు పారుతుంది. బోరుబావుల్లోనూ నీరు పుష్కలంగా ఉన్నాయి. దీంతో వరి సాగు గత సంవత్సరం కంటే పెరిగింది. ఆరుతగి పంటలకు అడవి జంతువుల బెడద ఉండటంతో కాపలా కాసేందుకు రాతిరంబవళ్లు రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని వరి సాగు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

8,500 ఎకరాల్లో..

మండలంలో ఈ సంవత్సరం యాసంగిలో 8,500 ఎకరాల్లో వరి పంటలు సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. గతేడాది యాసంగిలో 7వేల ఎకరాల్లో వరి సాగు చేయగా 2,800 ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగుచేసినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఈ సంవత్సరం వరి సాగు పెరగడంతో పాటుగా ఆరుతడి పంటల సాగుతగ్గింది. 2,314 ఎకరాల్లో వేరుశనగ, ఉల్లి, ఆముదం పంటలు సాగు చేసినట్లు అధికారులు గుర్తించారు.

అడవి జంతువుల బెడదతో..

వేరుశనగ, మినుము, కురగాయల పంటలకు అడవి జంతువుల బెడద ఎక్కువగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఈ పంటలను గ్రామాలకు దూరంగా ఉన్న పొలాల్లో సాగు చేయడం వలన అడవి పందులు, కోతుల బెడద ఎక్కువగా ఉందంటున్నారు. మరో పక్క చవుడు నేలల్లో ఆరుతడి పంటలు సాగు చేసే పరిస్థితి లేదు. ఈ నేలల్లో వరి తప్ప మరేపంట సాగు చేసిన కనీసం మొలకు కూడా రాదని రైతులు చెబుతున్నారు.

7 ఎకరాల్లో వరి నాటిన



ఈ సంవత్సరం యాసంగికి 7 ఎకరాల్లో వరి సాగు చేశాను. మా పొలం గుట్టకు దగ్గరగా ఉంది. వరి కాకుండా వేరే ఆరుతడి పంటలు వేస్తే రాత్రివేళలో అడవి పందులు, పగలు కోతులు, నెమళ్లు వచ్చి మొత్తం తినేసి పోతాయి. వాటికి భయపడి మొత్తం వరి పంట వేశాం.

– బంగి నర్సింహ, రైతు అప్పారెడ్డిపల్లి

సాగు విస్తీర్ణం పెరిగింది



మండలంలో గతేడాది కంటే ఈసారి వరి సాగు పెరిగింది. వర్షాలు విస్తారంగా కురవడంతో పాటుగా కేఎల్‌ఐ నీళ్లు వస్తుండటంతో బోరుబావుల్లో నీరు పుష్కలంగా ఉంది. దీంతో వరి సాగు చేసేందుకే రైతులు ఆసక్తి చూపుతున్నారు. గతేడాది 7వేల ఎకరాలు సాగు చేయగా ఈసారి 8,500 ఎకరాల్లో సాగు చేశారు.

–మల్లయ్య, వ్యవసాయ అధికారి, ఖిల్లాఘనపురం

సంఘీభావ సభకు తరలిన నాయకులు



నినాదాలు చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పాన్‌గల్: హైదరాబాద్‌లోని రవీంద్రభారతి లో నిర్వహిస్తున్న చే గువేర సంఘీభావ సభకు ఆదివారం మండలంలోని తెల్లరాళ్లపల్లి నుంచి తరలివెళ్లారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బాల్యానాయక్ మాట్లాడుతూ.. చే గువేరా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉద్యమం నిర్వహించారన్నారు. ఈ పోరాట ఫలితంగానే కర్షకులు, కార్మికులు, ప్రజలు, మేధావులు ఐక్యత పర్చడంలో కీలక పాత్ర పోషించారన్నారు. దేశంలో సోషలిజం రావాలని, సమాన పనికి సమాన వేతనం కోసం పోరాడిన చేగువేర ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ పోరాడాలన్నారు. రవీంద్రభారతిలో చేగువేర మనవరాలు, కూతురు వస్తున్న సందర్భంగా సభకు తరలివెళ్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మురళీ, నాగరాజు, వెంకటస్వామి, సాయిలీల ఉన్నారు.

పేదలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జబ్బార్

మదనాపురం: పేదలందరికీ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జబ్బార్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ రెండో సారి అధికారంలోకి వచ్చినా ఇళ్లు ఇస్తామని వాగ్దానం నెరవేరలేదన్నారు. ప్రస్తుతం సొంత స్థలం ఉన్న ప్రతి ఒక్కరికి రూ.3 లక్షల ఇస్తామంటూ మోసం చేస్తున్నారని ప్రతి ఒక్కరికి రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రి హరీష్‌రావు ఇళ్లపై అనేక మార్లు ప్రకటనలు చేశారని తెలిపారు. మండలంలో బుడ్డలు, రైస్ మిల్లులో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాడం లేదన్నారు. కార్మికుల పక్షాన మా పార్టీ పోరాటం చేస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వం మతోన్మాద విధానాలతో ప్రజల మధ్య చీలిక తెస్తుందని ప్రధాని నరేంద్ర మోడీ కార్పొరేట్ శక్తులకు రూ.11 లక్షల కోట్లు రుణాలు మాఫీ చేసి పేదలపైన జీఎస్టీ పేరుతో అదనపు భారం మోపుతున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రజలంతా వ్యతిరేకించి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజు, వెంకట రాములు, మన్యం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విప్లవ వీరుడు లెనిన్



లెనిన్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

పాన్‌గల్: దోపిడి, ఆకలి బాధలు లేని సమ సమాజం కోసం పోరాడిన విప్లవ వీరుడు లెనిన్ అని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్ అన్నారు. ఆదివారం మండలంలోని కేతేపల్లి భగత్‌సింగ్ నగర్‌లో లెనిన్ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రష్యాలో అక్టోబర్ విప్లవం భారత యువతకు స్వాతంత్ర్య పోరాటంలో స్ఫూర్తినిచ్చిందన్నారు. బీజేపీ పాలనలో మతాలను రెచ్చగొట్టి ప్రజలను చీల్చి సమైక్యతను దెబ్బతీస్తూ, యువతను పెడదోవ పట్టిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కుర్మయ్య, పెద్దహన్మంతు, మాల కుర్మయ్య, కుర్వ హన్మంతు, మద్దిలేటి, కోటయ్య, బీరయ్య పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరీదేవి ఉత్సవాలు



అమ్మవారిని గంగాస్నానం కోసం ఊరేగింపుగా తీసుకువెళ్తున్న యాదవులు

పెబ్బేరు: పట్టణంలోని చౌడేశ్వరీదేవి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం పట్టణంలోని చౌడేశ్వరిదేవి గంగాస్నానం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. యాదవ కులస్తులు అమ్మవారిని గంగాస్నానం కోసం తీసుకువెళ్లారు. పట్టణంలోని వీధుల్లో భక్తులు అమ్మవారికి నిండుబిందె నీళ్లతో పూజలు చేశారు. తాము కోరుకున్న కోరికలు తీర్చాలని భక్తులు వేడుకున్నారు. గంగాస్నానం అనంతరం రాత్రి 11గంటల నుంచి సోమవారం తెల్లవారుజామున వరకు అమ్మవారి పల్లకీ సేవ, జ్యోతుల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం ఉదయం 8గంటల నుంచి రాత్రి వరకు అమ్మవారిని భక్తులకు, ప్రజల సందర్శన కోసం చిన్న చౌడేశ్వరిదేవి గుడి వద్ద ఉంచుతున్నట్లు చెప్పారు.

26న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



వాల్‌పోస్టర్‌లను విడుదల చేస్తున్న నాయకులు

అమరచింత: మక్తల్ పట్టణంలో ఈనెల 26న అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ ఉంటుందని బీఎస్పీ నాయకుడు మారెప్ప తెలిపారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం వాల్ పోస్టర్‌లను విడుదల చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు విగ్రహ ఆవిష్కరణ 4 గంటలకు నెహ్రూగంజ్‌లో బహిరంగసభ ఉంటుందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, లింగన్న, రాములు, పెద్ద అంజప్ప పాటు పలువురు పాల్గొన్నారు.

నేటి నుంచి జములమ్మ ఉత్సవాలు

అమరచింత: పట్టణంలో వెలసిన జములమ్మ దేవతా ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు నర్సింహులు తెలిపారు. 23న అమ్మవారి వెండి ఆభరణాలు, పట్టువస్త్రాలను పట్టణంలోని మార్కండేయ ఆలయం నుంచి ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తీసుకెళ్తున్నట్లు వెల్లడించారు. మంగళవారం నుంచి జములమ్మ ఆలయంలో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు.

సీనియర్ నాయకుడి మృతికి నివాళి

పెబ్బేరు: మున్సిపాలిటీ పట్టణ కేంద్రంలోని మాజీ వార్డు సభ్యుడు కుమ్మరి అచ్చన్న అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. డీసీసీ కార్యదర్శి సత్యారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు రూ. 5వేలు ఆర్థికసాయం అందించారు. నివాళులు అర్పించిన వారిలో శ్రీనివాస్‌గౌడ్, రాములుయాదవ్, వెంకట్రాములు, రంజిత్ కుమార్, సునీల్‌కుమార్, సాయిగౌడ్, భాను తదితరులు ఉన్నారు.

వడ్డెరలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



అధ్యక్షుడు వెంకటేష్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

వనపర్తి క్రైం: వడ్డెరలకు సముచిత స్థానం కల్పిస్తామని, గుట్టలపై హక్కులు కల్పించడంతో పాటు, ఎస్టీ సాధనకై కృషి చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చెప్పిన మాటలను నిలబెట్టుకోవాలని వడ్డెర సంఘం అధ్యక్షుడు వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ వడ్డెర హక్కుల సాధన కోసం జిల్లాస్థాయి సమావేశంలో ఇచ్చిన హామీలను మంత్రి అమలు పరచాలని అన్నారు. కులవృత్తులకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుందని, ఎస్టీ సాధన కోసం కృషి చేస్తామని, జిల్లా కేంద్రంలో కుల సంఘానికి 20గుంటల స్థలంలో కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేస్తానని మంత్రి అన్నారని తెలిపారు. గుట్టలపై రాయికొట్టుకునేందుకు అనుమతులు ఇస్తామని చెప్పిన మాటలు ఏ ఒక్కటికి అమలు కాలేదన్నారు. కార్యక్రమంలో ఈశ్వర్, భూమయ్య, మధు, రమేష్, వెంకటేష్, రామచందర్, జయశంకర్, సాయికుమార్ తదితరులు ఉన్నారు.

రోస్టర్ మెరిట్ ఆధారంగా సీనియార్టీ జాబితా చేయాలి



నియామక పత్రం అందజేస్తున్న కృష్ణుడు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్ :ప్రభుత్వం ప్రస్తుతం చేపడుతున్న బదిలీలు, ప్రమోషన్‌లలో భాగంగా సీనియార్టీ జాబితాను కేవలం మెరిట్ ఆధారంగా చేస్తున్నారని, దీంతో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, అందుకోసం రోస్టర్ మెరిట్ ఆధారంగా చేయాలని బీసీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు కృష్ణుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని బీసీ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీసీ ఉపాధ్యాయులు సీనియార్టీ జాబితాను తయారు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. వెంటనే అధికారులు ప్రభుత్వం స్పందించి సీనియార్టీ జాబితా తయారీలో మార్పులు చేపట్టాలన్నారు. బదిలీలు, పదోన్నతులలో ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా పూర్తి స్థాయిలో పారదర్శంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. స్పౌజ్ ఉపాధ్యాయులపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుని వారిని న్యాయం చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ సలహాదారుడిగా అబ్దుల్‌రజాక్, ఉపాధ్యక్షుడిగా విజయ్‌కుమార్‌లను ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, రమేష్, గురుప్రసాద్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు విద్యారుణాలు



విద్యార్థులకు విద్యారుణాలు అందజేస్తున్న చైర్మన్ సోమ భరత్‌కుమార్

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగడానికి సీఎం కేసీఆర్ అవకాశాలు ఇస్తున్నారని రాష్ట్ర డైరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ సోమ భరత్‌కుమార్ అన్నారు. శ్రీవాసవీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని వాసవీ ఫంక్షన్‌హాల్‌లో 101 మంది విద్యార్థులకు రూ.28లక్షల వడ్డీలేని విద్యారుణాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆయనతోపాటు ఉప్పల శివకుమార్ ఐపీఎస్, ఇంటలిజెన్స్ ఓఎస్‌డీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు రాజకీయంగా, సామాన్య ప్రజలకు సేవలందించే విధంగా ముందుకు రావాలని కోరారు. విద్యారుణాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఇతరులకు సహాయం చేసే విధంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శ్రీవాసవీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధ్యక్షుడు మలిపెద్ది శంకర్, ప్రధాన కార్యదర్శి కండె కుమారస్వామి, కోశాధికారి కలకొండ సూర్యనారాయణ, సలహాదారు గుండ్ల కృష్ణయ్య, జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు పాలాది రామ్మోహన్, పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి మిర్యాల వేణుగోపాల్, శ్రీవాసవీ విద్యా వసతి గృహం అధ్యక్షుడు కొండ చక్రధర్‌గుప్త పాల్గొన్నారు.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు



ఉత్సవాలకు ముస్తాబైన గుండ్ల భీమరాయ స్వామి ఆలయం



ఆలయంలో ధన్వంతరి వేంకటేశ్వరస్వామి మూల విగ్రహం

అయిజ: మండలంలోని ఉత్తనూరులో ఈనెల 24 నుంచి 30 వరకు ధన్వంతరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లలో నిమగ్నం అయ్యారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. వివిధ అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

పూజల వివరాలు

ఉత్సవాల సందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, తోమాల సేవ, బిందెసేవ, పంచామృత అభిషేకం, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షా బంధనం, ఋత్విగ్వరణం, యాగశాల ప్రవేశం, వాస్తుహోమం, కలశస్థాపన, అగ్ని ప్రతిష్ఠ, అజురార్పణ, అంకురార్పణ హోమం, భేరీపూజ, ధ్వజారోహణం, దేవతాహ్వానం, గరుడ ప్రసాద వితరణ, నివేదన, హారతి శాత్తుమొరై, తార్థగోష్ఠి పూజలు నిర్వహించనున్నారు.

26న రథోత్సవం

ఈనెల 24న ధన్వంతరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు భక్తుల సంతానప్రాప్తికి గరడ ప్రసాదం ఇవ్వను న్నారు. అదేవిధంగా సాంస్కృతిక కార్యక్రమాలు, భజన పోటీలు నిర్వహించనున్నారు. 25న శ్రీవారి కల్యాణ మహోత్సవం, 26న శ్రీవారి రథోత్సవం తోపాటు నాలుగుపళ్ల విభాగం వృషభ రాజుల బల ప్రదర్శన ఏర్పాటు చేశారు. 27న మొండి సట్టం, శేషవాహన కార్యక్రమాలతో పాటు ఆరుపళ్ల విభాగం వృషభ రాజుల బల ప్రదర్శన, 28న చక్రస్నానం, ధ్వజారోహణం, పుష్ప యాగం, ఏకాంతసేవ తోపాటు న్యూ క్యాటగిరి విభాగం వృషభరాజుల బల ప్రదర్శన, 29న సబ్ జూనియర్ విభాగం, 30న సీనియర్స్ విభాగం వృషభరాజుల బల ప్రదర్శన ఉంటందని నిర్వాహకులు పేర్కొన్నారు. 30న గుండ్లు, సందెరాళ్లు, ఇసుక సంచులు ఎత్తుపోటీలు నిర్వహించనున్నారు.

అదేవిధంగా తొత్తినోనిదొడ్డిలో ...

మండలంలోని తొత్తినోనిదొడ్డిలో ఈనెల 25 నుంచి 29 వరకు గుండ్ల బీమరాయ స్వామి జాతర ఉత్సవాలు నిర్వహించనున్నారు. బుధవారం స్వామివారి పల్లకిసేవ, ప్రభోత్సవం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. అదేవిధంగా గురువారం రథోత్సవం, శుక్రవారం ఓపెన్ ఆల్ కబడ్డీ పోటీలు, సందెరాళ్లు, దొబ్బడి గుండ్లు, గుబ్బల గుండ్లు ఎత్తు పోటీలతోపాటు ఇసుక సంచులు ఎత్తే పోటీలు ఏర్పాటు చేశారు.

కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు



మూలమళ్లలో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు

- ప్రమాదాల బారిన ప్రజలు, మూగజీవాలు
- పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు

ఆత్మకూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు ఎప్పుడు చోటు చేసుకుంటాయోనని భయంతో ప్రజలు ఆందోళనకు చెందుతున్నారు. పట్టణంలోనే పరిస్థితి చక్కబెట్టని అధికారులు గ్రామాలవైపు కన్నెత్తి చూడడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. అలాగే పిన్నంచర్ల, బాలకిష్టాపూర్, ఖానాపూర్, గుంటిపల్లి, తిప్పడంపల్లి, జూరాల, మోట్లంపల్లి, మేడేపల్లి, రేచింతల, కత్తేపల్లి, తూంపల్లి, వీరరాఘవపూర్, మూలమళ్లలో ట్రాన్స్‌కో అధికారులు ఏర్పాటు చేసిన 54 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు నేటికీ కంచెను ఏర్పాటు చేయలేకపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద భద్రత లేకపోవడం వల్ల మూగజీవాలు షాక్‌కు గురై మృతిచెందిన సంఘటనలు గతంలో చోటు చేసుకున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



కత్తేపల్లిలో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



గుంటిపల్లిలో విద్యుదాఘాతంతో మృతి చెందిన గేదె (ఫైల్)

బడ్జెట్ రావడం లేదు..

ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు లేని కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్న విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు రాకపోవడంతో గ్రామాల్లో సర్పంచ్‌లు, మున్సిపాలిటీ ద్వారా కంచెలను ఏర్పాటు చేయాలని కోరుతున్నాం. ఆత్మకూర్ పట్టణంలో కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలను ఏర్పాటు చేశాం.

– నర్సింహులు, ఏఈ ట్రాన్స్‌కో, ఆత్మకూర్.